క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



అక్కన్నఅగ్రహారంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: రైతులంతా తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, అక్కన్నఅగ్రహారం, చాటాయవలస గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించి, దాని ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న వారికి ఏదైనా విపత్తు కారణంగా పంటనష్టం జరిగితే నష్టపరిహారం పొందేందుకు వీలుంటుందన్నారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లోనూ ఈ-క్రాప్ నమోదు చేయడం జరుగుతోందన్నారు.

దుస్తుల వితరణ



ఎరందొరవలస గిరిజనులతో దాతలు

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎరందొరవలస గ్రామ గిరిజన విద్యార్థులు, వృద్ధులకు మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం శుక్రవారం దుస్తులు వితరణ చేసింది. సంఘ ప్రతినిధి కేవీ శర్మ, వనమిత్ర కృష్ణదాసు ఆధ్వర్యంలో చిన్నారులకు అవసరమైన ఆటవస్తువులతో పాటు విద్యార్థులు, వృద్ధులకు వస్త్రాలు పంచిపెట్టారు. ప్రతినెలా వారికి అవసరమైన వాటిని అందించడంలో తమవంతు సాయం అందిస్తున్నామని, ఈ పని తమకు ఎంతగానో సంతృప్తినిస్తోందని వారు తెలిపారు.

వేప కషాయంతో చీడపీడల నివారణ



వేప కషాయం తయారీని వివరిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్

బొబ్బిలి రూరల్: వేప కషాయంతో పంటలకు పట్టే చీడపీడలు నివారించవచ్చని వ్యవసాయ ఏడీ ఎం.శ్యామసుందర్ అన్నారు. మండలంలోని పారాది గ్రామంలోని రైతులకు వేపాకు కషాయం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరినారు మొక్క దశకు చేరుకునేసరికి చీడపీడలు సోకుతాయని, వాటిని నివారించేందుకు వేప పిక్కలతో చేసిన కషాయాన్ని పంటపై పిచికారీ చేయాలని సూచించారు. ప్రతీ రైతు సేంద్రియ ఎరువులను వినియోగించాలని, అలా చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

భారీ వర్షం



బొబ్బిలి మెయిన్‌రోడ్డులో చేరిన వర్షపు నీరు

బొబ్బిలి: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘావృతమై కురిసిన వాన చాలాసేపు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపైకి పెద్దఎత్తున వర్షపునీరు వచ్చి, చేరుకుంది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు అనుకూలమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శ్మశానవాటికకు రోడ్డు నిర్మించండి

రాజాం: పట్టణంలోని సారధి గెడ్డ పక్కనే ఉన్న శ్మశానవాటికకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆశపు, కస్పా, కూరాకుల, బుక్కా, తాణా వీధులతో పాటు సారధి రోడ్డు ప్రాంతాల్లో ఎవరైనా చనిపోతే ఇదే శ్మశానవాటికకు తరలించి, దహన సంస్కారాలు నిర్వహిస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేని కారణంగా వర్షాకాలంలో ఆ దారి అంతా బురదమయమై మృతదేహంతో కూడిన పాడె తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, శ్మశానవాటికకు రోడ్డు సదుపాయం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

రాజాం: మండలంలో ఈ నెల 8వ తేదీన జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడిన పాఠశాలల్లో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నట్లు ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇప్పటికే ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. మండలంలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆగూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, సీతంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..!

వరలక్ష్మీ వ్రత పూజల నేపథ్యంలో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. వేకువజామున నిద్రలేచి పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలంతా తమకు దగ్గరలోని మందిరాలకు చేరుకుని, అమ్మవారికి విశేషపూజలు చేశారు. ఏటా శ్రావణమాసం శుక్లపక్షంలోని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా స్త్రీలు తమకు మంచి భర్త, పిల్లలు కలగాలని ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఇదేరోజున ఈ పూజ చేసిన వారికి అష్టైశ్వర్యాలు కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. కొంతమంది మహిళలు ఇళ్లల్లోనే వరలక్ష్మీదేవి చిత్రపటం ఏర్పాటు చేసుకుని, వ్రతం చేపట్టారు.

–బొబ్బిలి, రాజాం



రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



రామభద్రపురం: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



రాజాం: గాయత్రీదేవి ఆలయంలో భక్తుల వరలక్ష్మీ పూజలు



బాడంగి: ముగడ కాలనీలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళ



వంగర: రుషింగిలో భక్తులతో కిక్కిరిసిన దుర్గాదేవి ఆలయం



రాజాం సిటీ: నవదుర్గమ్మ దర్శనానికి క్యూలైన్‌లో నిల్చొన్న భక్తులు



తెర్లాం: పెరుమాళిలో వరలక్ష్మీ పూజ చేస్తున్న మహిళలు

కృష్ణమూర్తినాయుడికి ఘనంగా నివాళులు

బొబ్బిలి: పట్టణంలో మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు జయంతి శుక్రవారం నిర్వహించారు. కొప్పుల వెలమ సంఘ నాయకులంతా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అనంతరం నిరుపేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గొట్టాపు కృష్ణమూర్తి, కర్రి సత్యనారాయణ, బలగ సాయికృష్ణ, వాసిరెడ్డి తాతాజీ, తిరుపతిరావు, కొల్లి రామారావు, వాలేటి తవిటినాయుడు, కేతిరెడ్డి కృష్ణమూర్తి, పెంట స్వామినాయుడు, రెడ్డి కృష్ణమూర్తి, రెడ్డి దామోదరరావు, కుదమాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తినాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న కొప్పుల వెలమ సంఘ నాయకులు

పారిశుధ్య పనులు

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయవలస, చిన్నశిర్లాం తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు శుక్రవారం చేపట్టారు. రోడ్లుపై చెత్తాచెదారంతో పాటు కాలువల్లోని పూడికలు తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. వర్షాకాలం నేపథ్యంలో పేరుకుపోయే అపారిశుధ్యంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్యామలా కుమారి తెలిపారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.



వన్నలిలో మురుగునీరు పారుతున్న ప్రదేశంలో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

ఏనుగుల గుంపు బీభత్సం



పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగు



పెదరాజులగుమ్మడలో ఏనుగులు ధ్వంసం చేసిన మోటారు, పైప్‌లైన్‌ను చూపిస్తున్న రైతు వెంకటనాయుడు

వంగర: మండలంలోని వీవీఆర్ పేట, పెదరాజులగుమ్మడ గ్రామాల మధ్య ఏనుగుల గుంపు పంటలను నాశనం చేస్తున్నాయి. గత ఆరు రోజులుగా ఈ రెండు గ్రామాల మధ్య తిష్టవేసిన ఏనుగుల గుంపు చెరకు, వరి, మొక్కజొన్న, పామాయిల్ తోటలను ధ్వంసం చేస్తున్నాయి. పెదరాజులగుమ్మడ గ్రామ రైతు ఆలుబిల్లి వెంకటనాయుడుకు చెందిన పామాయిల్ మొక్కలతో పాటు మోటారు, డ్రిప్ ఇరిగేషన్ పైపులను శుక్రవారం ధ్వంసం చేశాయి. ఏనుగులను మళ్లించి పంటలను కాపాడాలని వీవీఆర్ పేట ఉపసర్పంచ్ మరిచర్ల విజయలక్ష్మి, గ్రామ పెద్దలు కోరారు. డీటీ బూరాడ సుందరరావు అటవీశాఖ అధికారులతో కలిసి ఏనుగులు గుంపును పరిశీలించారు. ప్రజలు అప్రమత్తం ఉండాలని కోరారు. ఎలిఫెంట్ ట్రేకర్స్ ప్రజలను అవగాహన కల్పించాలన్నారు.

ఓటరు అక్షరాస్యత వేదిక వార్షికోత్సవం

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో ఓటరు అక్షరాస్యత వేదిక తొలి వార్షికోత్సవాన్ని వ్యవస్థాపకులు డి.సూర్యారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికల వ్యవస్థలో లోపాలను ఎత్తిచూపేందుకు 1999లో ప్రొఫెసర్ త్రిలోచనశాస్త్రి, జగదీష్ చొకర్, డా.అజిత్‌రనడే ఏడీఆర్ సంస్థను ఏర్పాటు చేయగా.. జయప్రకాశ్‌నారాయణ ఎఫ్‌డీఆర్‌ను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వీరజవాన్ గనివాడ రవివర్మ తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి స్థానిక వైద్యులు ఆర్.త్రినాథరావు, జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎం.కొండలరావు, లైబ్రేరియన్ డి.శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు ఆర్.సూరిదేముడు, సి.హెచ్.రామకృష్ణ, మొల్లేటి అప్పారావు, మురళి, లోకేష్, డి.మేఘన తదితరులు పాల్గొన్నారు.



వీరజవాన్ రవివర్మ తల్లిదండ్రులను సన్మానిస్తున్న వేదిక ప్రతినిధులు

దేశం గర్వించే గొప్ప నాయకుడు వాజ్‌పేయి



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ముందుగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా.సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ.. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు గౌరవించే గొప్ప నాయకుడు, పార్లమెంటేరియన్ వాజ్‌పేయి అని కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లిన ఘనత వాజ్‌పేయ్‌కి దక్కిందన్నారు. రానున్న తరాలు వాజ్‌పేయ్‌ని ఆదర్శంగా తీసుకుని గొప్ప నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం, నాయిరాలవలస, జాడపేట, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, కాగితాపల్లి, పనసలవలస, పారంపేట, ఉనుకూరు, అంబాడ, వెంకటాపురం తదితర గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఇన్‌చార్జ్ జేఈ లావేటి హరి ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉంగరాడ మెట్ట పరిధిలోని బూరాడ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ అసౌకర్యం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్‌లోని సిరి, సహారా, ఆరోరా కంపెనీల ఫీడర్‌లతో పాటు కలువరాయి, బలిజిపేట ఫీడర్‌ల నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఆయా ప్రాంతాల పరిధిలోని బలిజిపేట, పినపెంకి, వంతరాం, నెమలాం, జగన్నాథపురం, కలువరాయి, పెంట, పిరిడి, బైర్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెవెన్యూ రికార్డుల తనిఖీ

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పి.సిసోడియా రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఎస్.కోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. వేపాడ మండలానికి చెందిన కొన్ని భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో భూముల కొనుగోలు, రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అవకతవకలు జరిగాయన్న విమర్శలు ఉన్నాయి. ఈ తరుణంలో సిసోడియా తనిఖీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నగదు ప్రోత్సాహకం అందజేత

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ తన తండ్రి తాతారావు స్మారకార్థం ఏటా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.లోహిత్‌కుమార్‌కు రూ.3 వేలు, టి.షణ్ముఖ్‌కు రూ.2 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని శుక్రవారం అందజేశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఎఫ్ఆర్ఎస్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దీపక్ లోంధే, సునీత, తదితరులు

గంట్యాడ: అంగన్‌వాడీ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించాలని రీసెర్చ్ ఆఫీసర్ (న్యూఢిల్లీ) డాక్టర్ దీపక్ లోంధే అన్నారు. మండలంలోని నరవ 1,2 అంగన్‌వాడీ కేంద్రాలను, కొఠారుబిల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని స్టేట్ కన్సల్టెంట్ సునీతతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ అమలు ఏవిధంగా జరుగుతుందనేది పరిశీలించేందుకు వచ్చినట్టు చెప్పారు. దేశంలోని 6 రాష్ట్రాల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా పౌష్టికాహార పంపిణీని పైలెట్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో విజయనగరం జిల్లాలోని విజయనగరం, గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టులను ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ శాంతకుమారి, సీడీపీఓ డోకుల ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు బాగుచేయరూ..





తెర్లాం రామమందిరం మలుపు వద్ద ప్రమాదకరంగా కల్వర్టు (ఇన్‌సెట్‌లో) కిందికి కూరుకుపోయిన కల్వర్టు

తెర్లాం: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే తెర్లాం–బొబ్బిలి ఆర్ అండ్ బీ రోడ్డులోని తెర్లాం రామమందిరం మలుపు వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఏ క్షణంలోనైనా కల్వర్టు పూర్తిగా కూరుకుపోయే పరిస్థితి ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పారాది వంతెన మరమ్మతులకు గురికావడంతో గ్రోత్ సెంటర్‌కు వెళ్లే వాహనాలన్నీ ఈ రోడ్డుపై నుంచే వెళ్తుండడంతో రామమందిరం మలుపు దగ్గరున్న కల్వర్టు మరమ్మతులకు గురైంది. ప్రతిరోజూ తెర్లాం నుంచి బొబ్బిలి, బొబ్బిలి నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ బస్సులు, కార్లు, వ్యాన్‌లు, ఆటోలు కలిపి కొన్ని వందల సంఖ్యలో వస్తూ వెళ్తుంటాయి. అధికలోడుతో వచ్చే లారీలతో కల్వర్టు పూర్తిగా దెబ్బతింటోందని సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేశ్వరరావుతో పాటు స్థానికులు కోరుతున్నారు. కల్వర్టు పూర్తిగా చెడిపోయి వాహనాల రాకపోకలు నిలిచిపోకముందే కల్వర్టును బాగుచేయాలని కోరుతున్నారు.

విద్యార్థినులకు అభినందన

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బరిణికాన హారిక, పంపాన మౌనిక జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్.కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, లెక్చరర్లు సుధీర్, వలీఖాన్, భాస్కర్, జి.ఈరన్న, శ్రీలక్ష్మి, తదితరులు శుక్రవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న జెడ్పీటీసీ గారతవుడు, తదితరులు

గజపతినగరం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. గజపతినగరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఇంటి వద్ద బొత్స సత్యనారాయణను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ గారతవుడు, పార్టీ సీనియర్ నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, పల్లి సంజీవరావు, కర్రి రామునాయుడు, ఇనుముల రాజు, లోగిశ శ్రీను, ఆదాడ గోపి, రాపాక సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.